## రక్తదాన శిబిరానికి తరలిరండి

### బీఆర్ఎస్ నాయకుడు శ్రీ వర్ధన్ రెడ్డి

బండ్లగూడ, ఫిబ్రవరి 26 : మార్చి 1న రాజేంద్రనగర్ బీ ఆర్ ఎస్ నియోజకవర్గం ఇన్‌చార్జి పటోళ్ల కార్తీకరెడ్డి జన్మదినం సందర్భంగా శంషాబాద్‌లో బీఆర్ఎస్ నాయకులు పెద్ద ఎత్తున రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆ పార్టీ నాయకులు శ్రీ వర్ధన్‌రెడ్డి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి రాజేంద్రనగర్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలివచ్చి రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేయాలని ఆయన కోరారు.

## పబ్బతి శ్రీకృష్ణకు డాక్టరేట్



డాక్టరేట్ అందుకుంటున్న పబ్బతి శ్రీకృష్ణ

హిమాయత్ నగర్, ఫిబ్రవరి 26: మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణకు ఉస్మానియా యూనివర్సిటీ జెనెటిక్స్ విభాగం డాక్టరేట్‌ను ప్రకటించింది.ఓయూ జెనెటిక్స్ డిపార్ట్‌మెంట్ గైడ్ ప్రొఫెసర్ అనుపల్లి రోజారాణి పర్యవేక్షణలో ఐసోలేషన్ ఆఫ్ యాక్టివ్ ఫ్యాక్టర్ ఫ్రమ్ అమరాంతస్ విరిడీస్ అండ్ ఇట్స్ ఆమిలియురెటివ్ పోటెన్షియల్ ఎగెనెస్ట్ ఐస్ ప్రోటె రెనాల్, మయోకార్డియల్ ఇన్ఫక్షన్ ఇన్ రాట్స్ అనే అంశంపై పరిశోధన పూర్తి చేసినందుకు పబ్బతి శ్రీకృష్ణకు డాక్టర్ లభించింది. పరిశోధనకు సహకారం అందించిన జెనెటిక్స్ విభాగం హెడ్ ప్రొఫెసర్ హెచ్.సురేఖ, బీఓఎస్ డాక్టర్ జి.సుమలత,డాక్టర్ ఎ.శ్రీనివాస్,డాక్టర్ ప్రశాంతకు కృతజ్ఞతలు తెలిపారు.

### తార్నాక జంక్షన్
## పనుల పరిశీలన

ఉస్మానియా యూనివర్సిటీ: వారం రోజుల్లో తిరిగి ప్రారంభం కానున్న తార్నాక జంక్షన్ పనులను హైదరాబాద్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) జోయల్ డేవిస్ బుధవారం పరిశీలించారు. ఇంకా కొన్ని పనులు పెండింగ్‌లో ఉండటంతో ఆయన వెంటనే జీహెచ్ఎంసీ అధికారులతో ఫోన్లో మాట్లాడి పనులను త్వరగా చేయించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన.. ట్రాఫిక్ ఏసీపీ సంపత్ కుమార్, నల్లకుంట ఇన్‌స్పెక్టర్ నర్సింగ్‌రావు, ట్రాఫిక్ విభాగం ఇంజినీరింగ్ సెల్ ఇన్‌స్పెక్టర్ భరత్ కుమార్, తదితరులకు పలు సూచనలు చేశారు.

# భక్తి ప్రపత్తులతో.. శివరాత్రి

### భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు

బంజారాహిల్స్, ఫిబ్రవరి 26: మహ శివరాత్రి పర్వదిన వేడుకలు ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల్లో బుధవారం భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్,వెంకటేశ్వరకాలనీ డివిజన్ల పరిధిలోని శివాలయాలన్నీ ఉదయం నుంచే భక్తులతో కిటకిటలాడాయి.

• శ్రీనగర్ కాలనీలోని శ్రీ భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో పెద్ద సంఖ్యలో భక్తులు పోటెత్తారు. ఆలయంలో విశేష అభిషేకాలు నిర్వహించారు.

• బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 1లోని శివాలయం, ఫిలింనగర్ దైవసన్నిధానం, ఎన్‌బీటీనగర్‌లోని హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆలయంతో సహా అన్ని శివాలయాల్లో విశేష అభిషేకాలు నిర్వహించారు. అర్ధరాత్రి పలు ఆలయాల్లో శివపార్వతుల కళ్యాణం, లింగోద్భవ అభిషేకాలు నిర్వహించారు.



బోరబండ శివాలయం ప్రాంగణంలో బారులు తీరిన భక్తులు

**• రాజేంద్రనగర్ సర్కిల్‌లో..**

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి, అత్తాపూర్ డివిజన్ పరిధిలో మహాశివరాత్రి మహోత్సవాలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు.

**• అత్తాపూర్‌లో...**

అత్తాపూర్ డివిజన్ రాంబాగ్‌లోని చిన్న అనంతగిరి శివాలయంలో మహాశివరాత్రి మహోత్సవాలను భారీ ఎత్తున నిర్వహించారు. శ్రీ ప్రణవ భక్త సమాజం ఆధ్వర్యంలో ఉదయం అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. దేవాలయానికి రాజేంద్రనగర్ ఏసీపీ శ్రీనివాస్, సీఐ కాస్ట్రో, మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్రెడ్డి తదితరులు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**• జీటీఎస్ దేవాలయంలో..**

వెంగళరావునగర్: మహ శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం జీటీఎస్ కాలనీలోని దేవాదాయ ధర్మాదాయశాఖ వారి శ్రీ వీరాంజనేయ భవానీ శంకర అయ్యప్ప సహిత షిర్డీ సాయిబాబా దేవాలయంలో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్ ఆలయానికి విచ్చేసి స్వామివారికి అభిషేకం నిర్వహించారు.



బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 1లోని శివాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

**బోరబండ బస్ టెర్మినల్ సమీపంలో..**

ఎర్రగడ్డ: మహ శివరాత్రి సందర్భంగా బోరబండ బస్ టెర్మినల్ సమీపంలోని దేవాదాయ శాఖ కు చెందిన శివాలయంలో భక్తు ల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఏ ర్పాట్లను చేశారు. ఆలయ కమిటీ చైర్మన్ ఆనంద్ తో పాటు కమిటీ సభ్యులు పూజలో పాల్గొన్నారు.

**• శంషాబాద్ మండలంలో..**

శంషాబాద్ రూరల్: మండలంలోని చిన్నగోల్కొండ గ్రామంలో చెన్నకేశవ ఆలయంలో శివపార్వతిల కల్యాణోత్సవం ఆలయ చైర్మన్ గుర్రంపల్లి పద్మావతిఅనంతారెడ్డి దంపతుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ భిక్షపతి, మాజీ వార్డు సభ్యులు గౌతమ్‌బాబు,సారా బాలరాజ్,వీరయ్య, సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్, యాదయ్య, శివశంకర్‌లతో పాటు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

• పెద్ద గోల్కొండ గ్రామంలోని భగీరథ శివాలయంలో ఆలయ చైర్మన్ సునీతాలక్ష్మయ్య ఆధ్వర్యంలో వేప చెట్టు, రావిచెట్టుకు వివాహం జరిపించారు. ఈ సందర్భంగా ఆయన ఆయన మాట్లాడుతూ శివరాత్రి సందర్భంగా పాడిపంటలు బాగా పండే విధంగా వర్షాలు కురిసి ప్రజలందరూ సంతోషంగా ఉండే విధంగా ఉండాలని కోరుతూ రెండు చెట్లకు వివాహం చేశామని వివరించారు. కార్యక్రమంలో భాస్కర్‌గౌడ్,సురేష్‌యాదవ్,పాండురంగారెడ్డి,వెంకటేశ్, సంతోష్, భజన్‌దాస్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

**• శంషాబాద్ పట్టణంలో..**

శంషాబాద్ పట్టణంలోని శ్రీవెండికొండ సిద్ధేశ్వర స్వామి ఆలయానికి భక్తుల భారీగా తరలివచ్చారు. శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని శ్రీవెండికొండ సిద్ధేశ్వరస్వామి ఆలయానికి దాదాపు 400 ఎండ్ల చరిత్ర ఉంది. భక్తుల రద్దీ అధికంగా ఉండడంతో శంషాబాద్ ఆర్‌జీఐఏ పోలీసులు బంధబస్తు ఏర్పాటు చేశారు.



జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని శివాలయంలో..





శంషాబాద్ మండలంలోని చిన్నగోల్కొండలో కల్యాణం అనంతరం పూజలో పాల్గొన్న ఆలయ చైర్మన్ అనంతరెడ్డి, తదితరులు



వెంగళరావునగర్:ప్రత్యేక పూజల్లో పాల్గొన్న రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ గోపిశెట్టి నిరంజన్



అత్తాపూర్ చిన్న అనంతగిరి శివాలయంలో శివరాత్రి మహోత్సవాల్లో పాల్గొన్న శ్రీ ప్రణవ భక్త సమాజం సభ్యులు, భక్తులు

### ఇక నుంచి ప్రతి శనివారం
## ఆస్తిపన్ను పరిష్కార వేదికలు

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 26: మార్చి 1 నుంచి ప్రతి శనివారం ఆస్తిపన్ను పరిష్కార వేదికలు నిర్వహించనున్నారు. ఈ ఏడాది ఆస్తి పన్ను చెల్లింపులకు 1 నెల మాత్రమే గడువు వుండడంతో ఫిబ్రవరి 22 నుంచి ప్రతి శనివారం ఆస్తిపన్ను పరిష్కార వేదికలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా మార్చి 1, 8, 15, 22, 29 తేదీలలో యూసుఫ్‌గూడలోని 19 వ సర్కిల్ కార్యాలయంలో పరిష్కార వేదికలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. వివాదాలలో వున్న ఆస్తిపన్ను వ్యవహారాలను సత్వరమే పరిష్కరించేందుకు ఈ వేదికలు ఉపయోగ పడనున్నాయి. మార్చి 31 తో ఆస్తి పన్ను చెల్లింపులకు గడువు ముగియనుండగా అధికారులు 100 శాతం లక్ష్యాన్ని చేరేందుకు కృషి చేస్తున్నారు. ఆస్తిపన్ను పరిష్కార వేదికలు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ కమిషనర్ జాకియా సుల్తానా ఒక ప్రకటనలో కోరారు.

## యూసుఫ్‌గూడ టౌన్ ప్లానింగ్ ఏసీపీగా ప్రసీద

జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 26: యూసుఫ్‌గూడ సర్కిల్ టౌన్ ప్లానింగ్ ఏసీపీగా ఎన్. ప్రసీద నియామకమయ్యారు. ఇటీవల ఇక్కడ ఏసీపీగావిధులు నిర్వర్తించిన కృష్ణవేణి నల్గొండ జిల్లా పురపాలికకు బదిలీపై వెళ్లారు. ఆ స్థానం లో ఖైరతాబాద్ డీటీసీ ప్లానింగ్ శాఖ నుంచి ప్రసీద బదిలీపై జీహెచ్ఎంసీ 19 వ సర్కిల్‌కు వచ్చారు.

బల్దియాలో కీలకమైన టౌన్ ప్లానింగ్ విభాగానికి గత కొంతకాలంగా ఏసీపీ లేకపోవడంతో సంబంధిత పనులు నిలిచి పోతున్నాయని ప్రజలు ఆవేదన చెందుతున్నారు. జీహెచ్ఎంసీ 19 వ సర్కిల్‌లో యూసుఫ్‌గూడ, రహమత్ నగర్ డివిజన్లలో జంక్షన్ అభివృద్ధి కోసం రోడ్డు విస్తరణ పనులు చేపట్టాల్సి వుంది. దీంతోపాటు అక్రమ నిర్మాణాల పై ప్రత్యేక దృష్టి పెట్టాల్సిన ఈ విభాగం ఒకే ఒక సెక్షన్ ఆఫీసర్‌తో కొనసాగుతుండడంతో ఆయా పనులు అడుగు ముందుకు పడని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో పట్టణ ప్రణాళిక విభాగానికి ఏసీపీ నియామకంతో పెండింగ్‌లో ఉన్న సమస్యలు పరిష్కారం కానున్నాయి.



## టీటీడీ ఆలయ బ్రహ్మోత్సవాలు ప్రారంభం

జూబ్లీహిల్స్‌లోని టీటీడీ శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ధ్వజారోహణ మహోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అంతకుముందు స్వామివారికి సుప్రభాత సేవ, విశేష పూజల అనంతరం భక్తులకు స్వామివారి దర్శనం కల్పించారు. సాయంత్రం స్వామివారికి ఊంజల్ సేవ నిర్వహించారు. రాత్రి శ్రీవారిని పెద్ద శేషవాహనంపై మాడవీధుల్లో ఊరేగించారు. – బంజారాహిల్స్,ఫిబ్రవరి 26:

## విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు

సైదాబాద్ ఫిబ్రవరి 26 : కాలనీవాసులకు రాత్రివేళలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని విద్యుత్ సిబ్బందిని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణరవీందర్‌రెడ్డి ఆదేశించారు. డివిజన్ పరిధిలోని కరణ్‌బాగ్‌కాలనీలో కొనసాగుతున్న విద్యుత్ సమస్యలు, మరమ్మతు పనులను కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ మాలాద్రితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాలనీలోని విధిదీపాలు సక్రమంగా వెలగడం లేదని, అదే విధంగా కొన్నిచోట్ల స్తంభాలకు చెట్ల కొమ్మలు అడ్డంగా ఉండడం వల్ల వెలుతురు రాకపోవడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని విద్యుత్ సిబ్బందిని ఆదేశించారు. ల్యాండర్ సాయంతో అనేక ప్రాంతాల్లో వీధి దీపాలను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ మాలాద్రి, వర్క్ ఇన్‌స్పెక్టర్ దుర్గారావు, రవి, శరత్, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



వీధిదీపాల మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ అరుణ రవీందర్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు శ్రీనివాస్ మాలాద్రి

## మసీదుల వద్ద లైట్లు ఏర్పాటు

బన్సీలాల్‌పేట, ఫిబ్రవరి 26 : రంజాన్ మాసంలో పవిత్ర ఉపవాస దీక్షలు ప్రారంభమవుతున్న సందర్భంగా బన్సీలాల్ పేట్ డివిజన్‌లోని ఐదు ప్రధాన మసీదుల వద్ద అదనంగా 150 లైట్లు మంజూరయ్యాయని కా ర్పొరేటర్ హేమలత తెలిపారు. ఈ మేరకు బుధవారం బోయిగూడలోని మసీద్ ఏ ఖుబా వద్ద నూతన లైట్లను స్తంభాలకు అమర్చారు. సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆదేశాల మేరకు అన్ని మసీదు ల పరిసరాల్లో అదనంగా లైట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు లక్ష్మీపతి, ఎంఏ రజాక్, సల్మాన్ షేక్ పాల్గొన్నారు.



బోయిగూడ మసీదు వద్ద అదనపు లైట్లతో బీఆర్ఎస్ నాయకులు

### పండుగ పూట.. నీళ్లు లేక..
## అవస్థలు

బండ్లగూడ, ఫిబ్రవరి 26: రాజేంద్రనగర్ భవానీ కాలనీలో మంచినీరు రాక స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మహా శివరాత్రి పండుగ పూట మంచినీళ్లు రాకపోవడంతో కాలనీలోని ప్రజలు నీళ్ల కోసం బయటకు పరుగులు తీయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వేసవి కాలం ప్రారంభంలోనే పరిస్థితి ఇలా ఉంటే రాబోయే రోజుల్లో భవానీ కాలనీకి తాగునీటి కష్టాలు తప్పేటట్లు లేవని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని రోజులుగా మంచినీటి సరఫరాలో తీవ్ర అంతరాయం జరుగుతోందని కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. కనీసం పండగ రోజు అయినా కూడా నీటి సరఫరా చేయకపోవడం ఏంటని కాలనీవాసులు మండిపడుతున్నారు ఇకనైనా జలమండలి అధికారులు స్పందించి భవానీ కాలనీకి నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చూడాలని కాలనీవాసులు కోరుతున్నారు.

### నిజాం కళాశాలను సందర్శించిన
## న్యాక్ బృందం

సుల్తాన్ బజార్,ఫిబ్రవరి 26: విద్యా సంస్థల పనితీరును– నాణ్యతా ప్రమాణాలను అంచనా వేసి గుర్తింపును ఇచ్చేందుకు యూ జీసీ – న్యాక్ బృందం సభ్యులు రెండు రో జుల పాటు నిజాం కళాశాలను సందర్శించారు. ఈనెల 24, 25 తేదీల్లో రెండు రోజుల పాటు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్‌కు చెందిన న్యాక్ ( నేషనల్ అసెస్మెంట్ అక్రిడిటేషన్ కౌన్సిల్ ) సభ్యులు నిజాం కళాశాలలోని ప్రిన్సిపాల్ కార్యాలయంతో పాటు ప్లేస్‌మెంట్ సెల్, ఎన్ఎస్ఎస్, ఎన్‌సీసీ, ఈఓసీ, పరీక్షల విభాగం, విమెన్ ఎంపవర్‌మెంట్ సెల్, క్రీడా విభాగం మొదలైన వాటితో పా టు సోషల్ సైన్స్ , కామర్స్ , సైన్స్, మేనేజ్మెంట్ లకు సంబంధించిన వివిధ డిపార్ట్ మెంట్లను న్యాక్ బృందం సభ్యులు పరిశీలించారని నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ఏవీ రాజశేఖర్ తెలిపారు. అనేక అంశాలపై న్యాక్ బృందం సభ్యులు అడిగిన ప్రశ్నలకు వివరించినట్లు తెలిపారు. చారిత్రక నిజాం కళాశాల ప్రగతి ప్రస్థానాన్ని మరింత ముందుకు తీసుకుపోయేందుకు నిరంతరం కృషి చేస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా తమ కళాశాలకు సూచనలు సలహాలు చేసి సహకరించిన ఓయూ వీసీ ప్రొఫెసర్ ఎం.కుమార్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి. నరేశ్‌రెడ్డి, ఓఎస్‌డీ ప్రొఫెసర్ జితేందర్ కుమార్ నాయక్, యూజీసీ డీన్ ప్రొఫెసర్ లావణ్య పాల్గొన్నారు.

## బ్యూటీగ్రీన్ రిసార్ట్‌లో పుణ్యస్నానాలు

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 26 : మహా కుంభమేళ జరుగుతున్న ప్రయాగ్‌రాజ్ నది నీటిని భక్తుల కోసం హైదరాబాద్‌కు తీసుకొచ్చినట్లు శంషాబాద్ మండలంలోని సుల్తాన్‌పల్లి బ్యూటీగ్రీన్ రిసార్ట్ నిర్వాహకులు పేర్కొన్నారు. తెచ్చిన ఆ నీటిని రిసార్ట్‌లోని స్విమ్మింగ్ పూల్ నీటిలో కలిపి ఉచితంగా భక్తులు పుణ్యస్నానాలు ఆచరించే విధంగా సౌకర్యం కల్పించినట్లు నిర్వాహకులు గోకుల్, అనూఫ్‌కుమార్, శంకర్‌లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహా కుంభమేళకు వెళ్లలేని భక్తుల కోసం ప్రయాగ్‌రాజ్ నుంచి 20లీటర్ల నీటిని తీసుకొచ్చి ఇక్కడ ఉన్న స్విమ్మింగ్‌పూల్‌లో కలిపి భక్తులు ఉచితంగా పుణ్యస్నానాలు ఆచరించే విధంగా సౌకర్యం కల్పించినట్లు చెప్పారు. ఉదయం నుంచి దాదాపు 1000 పైగా భక్తులు వచ్చి పుణ్యస్నానాల చేశారన్నారు. వారి ఉచితంగా భోజన వసతి కూడా కల్పించామన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దండుఇస్తారి, మల్లికార్జున్, మైలారం రాజు, సిద్ధయ్య, తదితరులు పాల్గొన్నారు.



బ్యూటీగ్రీన్‌లోని రిసార్ట్‌లో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

### అందుబాటులోకి .. అంబర్‌పేట ఫ్లై ఓవర్



ఎట్టకేలకు అంబర్‌పేట నుంచి గోల్నాక వరకు నిర్మించిన ఫ్లై ఓవర్ పనులు పూర్తి అయ్యాయి. దీంతో బుధవారం ఈ ఫ్లైఓవర్ పై వాహనాలు వెళ్లడం ప్రారంభించాయి. బీఆర్ఎస్ హయాంలో ఆ ప్రాంతంలో ట్రాఫిక్‌ను గుర్తించిన రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఫ్లై ఓవర్ పనులకు శ్రీకారం చుట్టిన విషయం విదితమే..

## జైహింద్ పార్కును ప్రారంభించాలి

హయత్‌నగర్, ఫిబ్రవరి 26 : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హెచ్ఎండీఏ నిధులు దాదాపు రూ.2కోట్లు వెచ్చించి హయత్‌నగర్ డివిజన్ సీటీవో కాలనీలో నాలుగు వేల గజాల విస్తీర్ణంలో నిర్మించిన జైహింద్ పార్కును వెంటనే ప్రారంభించాలని హయత్‌నగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ సామ తిరుమలరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం హయత్‌నగర్‌లోని జైహింద్ పార్కు ఎదుట బీఆర్ఎస్ నాయకులు, స్థానిక కాలనీవాసులతో కలిసి మాజీ కార్పొరేటర్ సామ తిరుమలరెడ్డి పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో ఇన్‌చార్జి మంత్రి సమయమివ్వకపోవడం వల్ల జైహింద్ పార్కు ప్రారంభానికి నోచుకోలేదన్నారు. చుట్టుపక్కల ప్రాంతాలైన ఆరు కాలనీల్లో ప్రధానంగా డ్రైనేజీ సమస్య తీవ్రంగా నెలకొందన్నారు. వాటి నిర్మాణానికి కొత్తగా నిధులు కేటాయించడం లేదని, నూతన పనులకు శ్రీకారం చుట్టడం లేదని అసహనం వ్యక్తం చేశారు. 15 నెలలుగా కాలనీల్లో సమస్యలను పట్టించుకున్న నాథుడే కరువయ్యాడని ఆరోపించారు. డ్రైనేజీల్లో పందుల బెడద అధికమై కాలనీల్లో దోమలు విజృంభిస్తున్నాయని మండిపడ్డారు. ప్రజలు ఇంటి పన్నులు, ఇంటి అనుమతులకు లక్షల్లో రూపాయలు చెల్లించి ఇంటి నిర్మాణాలకు అనమతులు తీసుకుంటున్నారని, మున్సిపల్, జీహెచ్ఎంసీ అధికారులు ఆయా కాలనీవాసుల సమస్యలను ఏమాత్రం పట్టించుకోవడం లేదన్నారు. నిధుల కొరత వల్లే ఆయా కాలనీలకు మౌలిక వసతులు కల్పించలేకపోతున్నామని అధికారులు చెబుతున్నారు. హయత్‌నగర్ డివిజన్ అభివృద్ధికి దూరంలో ఉందన్నారు. జైహింద్ పార్కును ప్రారంభించి చుట్టుపక్కల కాలనీలైన గ్రీన్‌వుడ్‌కాలనీ, వాసవీకాలనీ, బ్లడ్ బ్యాంక్ కాలనీ, సీటీవో కాలనీల్లో డ్రైనేజీ సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఆయా కాలనీవాసులకు మద్దతుగా బీఆర్ఎస్ ఉంటుందని, ప్రభుత్వం వెంటనే స్పందించి ఆయా సమస్యలను పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు చెన్నగోని శ్రీధర్‌గౌడ్, నాయకులు భాస్కర్‌సాగర్, మల్లేశ్ ముదిరాజ్, మహిళా నాయకురాలు సింగిరెడ్డి మల్లీశ్వరిరెడ్డి, సీటీవో కాలనీ సింగం వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.




జైహింద్ పార్కు ఎదుట కాలనీవాసులతో కలిసి నిరసన తెలుపుతున్న మాజీ కార్పొరేటర్ సామ తిరుమలరెడ్డి

## నూతన కార్యవర్గం ఎన్నిక

ఎల్బీనగర్, 26: నాగోల్‌లోని నరసింహ స్వామి కాలనీ ఫేస్ – II రెసిడెంట్స్ కొత్త ఎగ్జిక్యూటివ్ బాడీని ఎన్నుకోవడం జరిగింది. ఎగ్జిక్యూటివ్ బాడీ అధ్యక్షుడిగా విజయసింహారెడ్డి, ఉపాధ్యక్షుడిగా కాశీరావు, సురేందర్‌రావు, ప్రధాన కార్యదర్శి మురళి, సంయుక్త కార్యదర్శులుగా శ్రీపతిరావు, ఆర్గనైజింగ్ సెక్రటరీగా శిరీష, కోశాధికారిగా సుధాకర్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా వెంకట్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, నటరాజ్ ఎన్నికయ్యారు.

## నగదు బహుమతి అందజేత

కందుకూరు, ఫిబ్రవరి 26 : మండల పరిధిలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో మొదటి ర్యాంకు సాధించిన విద్యార్థులకు మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో రూ.2500 చొప్పున మహేశ్వరం నియోజకవర్గం బీజేపీ ఇన్‌చార్జి శ్రీరాములుయాదవ్ అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు అంజిరెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ దేవేందర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు నరసింహారెడ్డి, దళిత మోర్చా రాష్ట్ర నాయకుడు పాండు, జిల్లా నాయకులు పాల్గొన్నారు.



## శిల్పారామంలో శివరాత్రి ఉత్సవాలు

మాదాపూర్ లోని శిల్పారామంలో మహ శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం సిద్ధ నాట్య కళా సమితి ఆధ్వర్యం లో " నాట్య అంజలి " ఉత్సవాన్ని నిర్వహించారు. సుందరి రవి చంద్ర, డాక్టర్ పేరిణి కుమార్, హైమావతి, జయ కవి, శిరీష, బాలాజీ, శ్రీవల్లి రావు, నివేదిత, శృతికిరణ్ శిష్య బృందాలు లింగాష్టకం, శివస్తుతి, భో శంభో, రవాణా కృత శివ తాండవం, శంకర గిరిజ పతి, గంగాధరవర, అంగీకారం భువనం, పంచమూర్తి కౌత్తం, కాలభైరవాష్టకం అంశాలను ప్రదర్శించారు. యక్షగాన కంఠీరవ డాక్టర్ పసుమర్తి శేషు బాబు, నాట్య మయూరి డాక్టర్ సత్య ప్రియాలు ముఖ్య అతిథులుగా విచ్చేసి గురువులు, కళాకారులను అభినందించారు. – కొండాపూర్